

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





మంగళవారం, డిసెంబర్ 9, 2025 | పేజీలు: 6


## ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత

# ధోరణి పాటించాలి

**-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్: డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి)** గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించడం ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యత అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు.సోమవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడలోని సుఖజీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన ఎన్నికల నిర్వహణ శిక్షణ తరగతులను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లు మరియు శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు,సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని,ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు,విధుల్లో నిష్పాక్షికత,బ్యాలెట్ బాక్సులు నిర్వహణ, బ్యాలెట్ ఓటింగ్ పద్ధతులు,రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌ను -మిగతా 2లో..



## నేడు సాయంత్రం నుంచి

# వైన్స్ బంద్

**నాగర్ కర్నూల్ : డిసెంబర్ 08 ప్రజా జ్యోతి** ఈ నెల 11న, తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలో నేడు(మంగళవారం) సాయంత్రం 5:0 గంటల నుంచి 11వ,తేది వరకు వైన్స్ షాపులు,బార్లు,రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని,ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.తొలి విడత ఎన్నికలు ఈ నెల 11న, 4,236 స్థానాల్లో జరగనున్నట్లుఅధికారులు తెలిపారు.



## ఎన్నికల సజావుగా జరిగేలా

# ఏర్పాట్లు చేయాలి

**-చట్ట విరుద్ధ చర్యలపై కఠినంగా వ్యవహరించాలి**
**-గద్వాల జోన్ డిఐజి ఎల్ఎస్ చౌహాన్**



**నాగర్ కర్నూల్ : డిసెంబర్ 08 ప్రజా జ్యోతి** రాష్ట్రవ్యాప్తంగా జరుగుచున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొని అధికారులు ఇచ్చిన వివరాలను విశ్లేషించి,పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలనీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని ప్రతి ఓటరు భయపడకుండా, స్వేచ్ఛగా ఓటు -మిగతా 2లో..

## నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి

# కృషి చేయాలి

**-కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృష్ణ చేయాలి -పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి**

**నాగర్ కర్నూల్: డిసెంబర్ 08 ప్రజా జ్యోతి**
స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని ఎంపీ మల్లు రవి పిలుపు నిచ్చారు.సోమవారం తాడూరు,మేడిపూరు,పొల్కూర్, గుట్టలపల్లి,తెలకపల్లి కేంద్రాల్లో మల్లు రవిఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

-మిగతా 2లో..



### ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత

# ధోరణి పాటించాలి

పూర్తిగా అర్థం చేసుకోవాలనిఎలాంటి అంతరాయం లేకుండా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడం మనందరి బాధ్యత అని పోలింగ్ సిబ్బంది తమ పాత్ర ఎంత ముఖ్యమో గ్రహించి,శిక్షణలో నేర్చుకున్న ప్రతిదాన్ని ప్రాక్టికల్‌గా అమలు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో చిన్న తప్పిదం కూడా పెద్ద సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉన్నందున ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి ముందుకు సాగాలని సూచించారు.కేంద్రాల వద్ద వృద్ధులు, వికలాంగులు,గర్భిణీల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని,క్యూలైన్‌ల నిర్వహణలో శ్రద్ధ వహించాలని,ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు వెలుతురుతో కూడిన గదుల్లో ఏర్పాటు చేయాలని,తప్పనిసరిగా అన్ని మౌలిక వసతులు కల్పన చేయాలని,కొన్ని కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ప్రక్రియను చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులను సమయపాలన,క్రమశిక్షణ, నిష్పక్షపాత ధోరణితో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని,

ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియను ప్రారంభించేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అనుమతి ఇచ్చిన ఏజెంట్లను మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని, ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఎన్నికలను సజావుగా నిర్వహించి, మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టి ఎన్నికల విజయం సాధించిన వార్డు సభ్యుల సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించి ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను కూడా అదేరోజు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అనివార్య కారణాల వల్ల గెలిచిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే మరుసటి రోజు ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఎన్నికల సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి

వేసే వాతావరణం కల్పించడం పోలీసుల భాధ్యత అని అన్నారు.జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిస్థితిని అధ్యయనం చేసిన డి.ఐ.జి.ప్రత్యేక బృందాల గస్తీ,రాత్రి వేళల్లో నిఘా,ఇంటెలిజెన్స్ సమాచారసేకరణపై మరింత దృష్టి సారించాలని సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేసినా,విద్వేష పూరిత పోస్టులను,ఎన్నికల ప్రక్రియను ప్రభావితంచేసే కార్యకలాపాలను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని,ఎన్నికల సందర్భంగా నిజమైన ట్రబల్ మంగర్స్ నీ గుర్తించి బైండోవర్ కేసులు చేయాలని,మద్యం అక్రమ రవాణ,బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలపై,రౌడీ షీటర్స్ కదలికలపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలనిచట్టవిరుద్ధ చర్యలపై కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.తక్కువ టైం లో జిల్లా ఎస్పీ జిల్లా మీద మంచి అవగాహనా కలిగి ఉన్నారని ప్రశంసించారు,ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్,అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు,డీఎస్పీలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, జిల్లాలోని ఇన్స్పెక్టర్లు,ఆర్.ఐ లు,వివిధ పోలీస్ స్టేషన్స్ ఎస్సైలు పాల్గొన్నారు.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**మహబూబ్ నగర్, డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి)**

గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి సూచించారు.రాజాపూర్, నవాపేట్ మండలాలలో ప్రిసైడింగ్ అధికారులకు(పి.ఓ) లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సోమవారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారుశిక్షణలో పాల్గొన్న పిఓ లను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని అన్నారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల దగ్గర ఎన్నికల సామగ్రి తీసుకునేటప్పుడు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు ఇతర ఎన్నికల సామాగ్రి సరిగ్గా ఉందా లేదా అని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా, బ్యాలెట్ పేపర్లు అన్ని సరిగ్గా ఉన్నాయా, ఏవైనా చినిగి ఉన్నాయా, సీరియల్ నంబర్లు సరిగ్గా ఉన్నాయా లేవా చూసుకోవాలని అన్నారు. పి ఓ లు బ్యాలెట్ పేపర్ అకౌంట్ ను సరిగ్గా నిర్వహించాలని అన్నారు.ఎన్నికల ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగుస్తుంది కనుక, పీ ఓ లు వెంటనే బ్యాలెట్ బాక్స్ ను సరిగ్గా సీల్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలని పేర్కొన్నారు.అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు(కౌంటింగ్) ప్రక్రియ



మొదలవుతుందని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగియగానే గెలిచిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు) జారీ చేసి అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించాలని ఆమె తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు,ఓటములకు ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యంగా పరిగణిస్తారు కాబట్టి పిఓలు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా ఎన్నికల నియమావళిని పాటిస్తూ, ఎటువంటి తప్పులు దొర్లకొండ ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు.రాజాపూర్ ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు.ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని అన్నారు.కలెక్టర్ తో పాటు ఎం.పి.డి.ఓ,తహశీల్దార్,మనల అధికారులు పాల్గొన్నారు.



### నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి

# కృషి చేయాలి

ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలని అన్నారు.ప్రతిపేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, తెలంగాణలో నిరుపేదలకు ఇస్తున్న సన్నబియ్యం దేశానికి ఆదర్శమని మల్లు రవి అన్నారు.నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 24,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రచారంచేసిప్రతిపక్షాల తీరును ప్రజలకు తెలియజేస్తూ చైతన్యంగా పనిచేయాలని కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కట్టుదిట్టంగా పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వల్లభ్ రెడ్డి,జంగిరెడ్డి,మల్లేష్, వేణుగోపాల్,మైనార్టీ జిల్లా అధ్యక్షుడు హబీబ్ రెహమాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

**గద్వాల డిసెంబర్ 7 (ప్రజాజ్యోతి)**

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సోమవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనీఖిలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చివరి దశలో ప్రచార జోరు

**ఇప్పలపల్లిలో స్వతంత్ర అభ్యర్థి నాగమణి సందడి**

**- సేవే లక్ష్యమంటూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్న అభ్యర్థి**

**మహబూబ్ నగర్, డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి )**

ఇప్పలపల్లి గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి నాగమణి ప్రచారం చివరి దశలో ఊపందుకుంది. ప్రచారం ప్రారంభం నుంచి ప్రతి ఇంటిని వ్యక్తిగతంగా సందర్శిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వచ్చిన నాగమణి, ఎన్నికల చివరి రోజుల్లో పాదయాత్రలు, ముఖాముఖి సమావేశాల ద్వారా ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు.

గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య, రహదారి మరమ్మత్తులు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు, యువత అభివృద్ధి వంటి అంశాలు తన ప్రాధాన్య ఎజెండా అని నాగమణి ప్రజలకు స్పష్టం చేశారు. పాత వాగ్దానాలు నెరవేరక నిరాశ చెందిన గ్రామ ప్రజల్లో ఆమె ప్రచారం ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.


“ఓటు కోసం కాదు%ె% సేవ కోసం ముందుకు వచ్చాను. మీ ఆశీర్వాదం దక్కితే ఇప్పలపల్లిని సమస్యలేని గ్రామంగా నిలబెడతాను” అని నాగమణి ప్రచారంలో చెప్పిన మాటలు స్థానికుల్లో నమ్మకం పెంచుతున్నాయి.

మహిళలు, యువత ముఖ్యంగా నాగమణి పర్యటనలకు విశేష స్పందన ఇస్తుండగా, స్వతంత్ర అభ్యర్థిగా ఆమె ప్రభావం గ్రామంలో స్పష్టంగా కనిపిస్తోంది.



# కాంగ్రెస్ హామీలు అమలు చేసి ఓట్లు అడగాలి

## - బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 8 (ప్రజా జ్యోతి):**
కాంగ్రెస్ హామీలు అమలు చేసి ఓట్లు అడగాలనీ బిఆర్ఎస్ అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా బిఆర్ఎస్ అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ నాచనహల్లి, కిస్టగిరి, పెద్దగూడెం తాండాలలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు శివకుమార్, కాటి పద్మ, శంకర్ నాయక్ తరపున విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాండాలలో "మన పాలన %-% మన రాజ్యం" నినాదాన్ని తీసుకొచ్చింది కెసిఆర్ అని, పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసీలకు భద్రత కల్పించిన ఘనత కూడా కెసిఆర్ దేనని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు సాగు, తాగు నీరు అందించిన నాయకుడు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలు చేయకుండా కేవలం ప్రచారం కోసమే సుమారు 3000 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాపాలన పేరుతో 500 కోట్లు, సంస్థల పేర్ల మార్పుకు 1000 కోట్లు, ఢిల్లీ పర్యటనలకు 250 కోట్లు, మంత్రుల హెలికాప్టర్ ప్రయాణాలకు 300 కోట్లు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు 250 కోట్లు, మిస్ వరల్డ్ కార్యక్రమానికి 200 కోట్లు, ఫ్లెక్సీలు%-%ఆర్భాటాలకు 200 కోట్లు, భారత్ సమ్మిట్‌కు 150 కోట్లు, మెస్సీ ఫుట్‌బాల్ ఈవెంట్‌కు 100 కోట్లు ఖర్చు చేసినట్టు ఆరోపించారు. ఆసరా పెన్షన్లు 4000 రూపాయలు, మహిళలకు 2500, తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలు అమలు చేసిన తర్వాతే కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ సుపరిపాలన, నిరంజన్ రెడ్డి ప్రజాహిత పరిపాలన కొనసాగాలంటే బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని వాకిటి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రవి ప్రకాష్ రెడ్డి, ధర్మా నాయక్, నారాయణ నాయక్, కృష్ణా నాయక్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ డ్యూటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

## - నేడు ఎంపీడీఓ కార్యాలయంలో ఓటింగ్ అవకాశం
## - ఎంపీడీఓ సాయిలక్ష్మి



**దామరగిద్ద డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి):**
దామరగిద్ద మండల పరిధిలో ఓటర్‌గా నమోదై ప్రస్తుతం ఎన్నికల విధుల్లో (ఎలక్షన్ డ్యూటీ) పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించినట్లు ఎంపీడీఓ సాయి లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం నేడు అందుబాటులో ఉంటుందని ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు దామరగిద్ద మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగులు తప్పనిసరిగా కింది పత్రాలను తమతో తీసుకురావాలని ఎంపీడీఓ సాయి లక్ష్మి సూచించారు.ఫారం %- ౪××ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ఓటర్ గుర్తింపు కార్డు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు ధ్రువపత్రం అర్హత కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# 7వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం జోరు

## - ఇంటి ఇంటికి తిరుగుతూ ఓటర్లను కలిసిన కనికి రెడ్డి - వి. స్వరూప

**దామరగిద్ద డిసెంబర్ 8(ప్రజాజ్యోతి):**
దామరగిద్ద మండలంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కనికి రెడ్డి, 7వ వార్డు సభ్యురాలిగా పోటీ చేస్తున్న వి. స్వరూపలు సోమవారం 7వ వార్డులో ఉధృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటి ఇంటికి వెళ్లి స్థానిక ఓటర్లను కలిసి తాము చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో మౌలిక వసతులు రహదారులు డ్రైనేజ్ సమస్యలు తాగునీరు వీధిలైట్లు వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తమకు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థికి కతేరా గుర్తుకు 7వార్డ్ మెంబర్ అభ్యర్థికి స్టూల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేశారు.



గ్రామ ప్రజల నుంచి కూడా మంచి స్పందన లభించడం గమనార్హం. గ్రామాభివృద్ధే మా లక్ష్యం %-% ప్రజా సమస్యలే మా ప్రాధాన్యత అన్న నినాదంతో ప్రచారాన్ని కొనసాగిస్తామని అభ్యర్థులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# బాపన్‌పల్లిలో అగ్నివీర్లకు ఘన సన్మానం

## - మిల్క్ సింగ్ ఆర్మీ ట్రైనింగ్ అకాడమీ నుంచి మరో 60 మంది ఎంపిక
## - బాపన్ పల్లి గ్రామ సర్పంచ్ గవినోళ్ల శీనన్న హర్షం

**దామరగిద్ద డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి):**
దామరగిద్ద మండలంలోని బాపన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మిల్క్ సింగ్ ఆర్మీ ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో అగ్నివీర్‌కు ఎంపికైన భారత ఆర్మీ జవాన్లను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గవినోళ్ల శీనన్న ముఖ్య అతిథిగా హాజరై అగ్నివీర్లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో అయ్యార్పల్లి రాఘవేంద్ర రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు రమణ వార్డు సభ్యులు మెట్టు నర్సింహా దేవేందర్ నాగయ్య స్వామి తదితరులు పాల్గొని జవాన్లను అభినందించారు. ఈ సందర్భంగా గవినోళ్ల శీనన్న మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా మిల్క్ సింగ్ ఆర్మీ అకాడమీ నుంచి సుమారు 60 మంది యువకులు అగ్నివీర్లుగా ఎంపిక కావడం ఎంతో సంతోషకరమాని అన్నారు. ఈ అకాడమీ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తున్న మహేష్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాని తెలిపారు. అకాడమీకి వెన్నంటిగా నిలుస్తున్న గవినోళ్ల ఉదయ్‌కు కూడా ప్రత్యేక అభినందనలు అని పేర్కొన్నారు. అలాగే రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ అకాడమీ అభివృద్ధికి తాను ఎప్పుడూ సహాయంగా ఉంటానని జిల్లా స్థాయిలో యువతకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా ఈ అకాడమీని అభివృద్ధి చేయాలని సూచించారు. అందుకు అయ్యే ఖర్చును కూడా తానే భరిస్తానని వెల్లడించారు. ఇప్పటి వరకు బాపన్‌పల్లి నుంచి 12 మంది భారత సైన్యంలోకి ఎంపిక కావడం గర్వకారణం అని శీనన్న పేర్కొంటూ ఆర్మీకి ఎంపికైన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవ చేయాలనే తపనతో ముందుకు వస్తున్న యువతను ప్రోత్సహించడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో అకాడమీ బాధ్యులు మహేష్ వ్యాయామ ఉపాధ్యాయులు రమణ వెంకటప్ప వార్డు మెంబర్ సభ్యులు తదితరులు ఉన్నారు.



# అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీజ్

## -అక్రమంగా సప్తగిరి రైస్ మిల్లులో నిల్వ ఉంచిన మద్యాన్ని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు -ఎస్ఐ. ఏ నాగరాజు

చిన్నంబావి డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి)
వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని మియాపూర్ గ్రామ పంచాయతీ గ్రామ శివార్లలో ఉన్న సప్తగిరి రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యంను పోలీసులు సోమవారం ఉదయం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని చిన్నంబావి ఎస్సై ఏ. నాగరాజు వెల్లడించారు.ఉదయం అందిన నమ్మదగిన సమాచారంతో, ఎస్సై నాగరాజు తన సిబ్బందితో కలిసి రైస్ మిల్లుపై అకస్మాత్తుగా దాడి చేశారు. తనిఖీ కొనసాగించగా పెద్ద ఎత్తున క్వార్టర్ బాటిళ్లు దొరికాయి. వీటి మొత్తం విలువ రూ. 2,56,608గా అంచనా వేశామని ఎస్సై తెలిపారు.స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలు: ఇంపీరియల్ బ్లూ,10 కార్టూన్లు.ఒక్కో కార్టూన్ 96 బాటిళు 90 ఎం.ఎల్, మొత్తం:86.40లీటర్లు. ఇంపీరియల్ బ్లూ 05 కార్టూన్లు.ఒక్కో కార్టూన్ 48 బాటిళ్లు 180 ఎం.ఎల్ మొత్తం: 43.20 లీటర్లు మెక్‌డోవెల్స్ 12 కార్టూన్లు ఒక్కో కార్టూన్ 48 బాటిళ్లు 180 ఎం.ఎల్ మొత్తం: 103.68 లీటర్లు మొత్తం స్వాధీనం: 27 కార్టూన్లు = 233.28 లీటర్లు అంచనా విలువ: రూ. 2,56,608 మూడో దశ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం నిల్వ ఉంచారనే అనుమానంతో జరిగిన ఈ దాడిలో భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. కానిస్టేబుల్ స్వామి గౌస్ కానిస్టేబుల్ సాయి హొంగార్డు పాల్గొన్నారు



# రిటైర్మెంట్‌కు ఆరు నెలలే.. అయినా ఎన్నికల డ్యూటీ షాక్!

**- అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగికీ ఎన్నికల విధులే!**
**- ఈసీ ఆదేశాలకైనా లెక్కలేదా? సీనియర్ ఉద్యోగికి కీలక డ్యూటీ**
**-వయస్సూ, వ్యాధులూ లెక్కకాదు..**
**ప్రిసైడింగ్ ఆఫీసర్ డ్యూటీ ఖాయం!**
**-మానవత మరిచారా? రిటైర్మెంట్**
**ఉద్యోగికీ తప్పని ఎన్నికల బాధ్యత**

**చిన్నంబావి: డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి)**

రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్న ఉద్యోగులకు ఎన్నికల డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలుకావడం లేదని ఆరోపణలు.వెల్లువెత్తుతున్నాయి. వయస్సు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కీలకమైన ఎన్నికల బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నంబావి మండల కేంద్రంలోనికొప్పునూర్ ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో ఇంచార్జి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పి. రవీందర్ రెడ్డి ఇంకా ఆరు నెలల్లో రిటైర్మెంట్ ఉందన్నారు. గత 20 ఏళ్లుగా హై బీపీ, షుగర్, నరాల బలహీనత, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్న ఆయనను పంచాయతీ ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నియమిస్తూ, అత్యంత దూరంలోని ఘనపూర్ మండలానికి డ్యూటీ వేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. చలికాలంలో బయట తిరగవద్దని ఫ్యామిలీ డాక్టర్. హెచ్చరిస్తున్నప్పటికీ, దూరప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించడం తన ఆరోగ్యానికి ప్రమాదకరమని రవీందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వనపర్తి జిల్లా పంచాయతీ అధికారికి తన డ్యూటీని మానవతా దృష్టితో రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించినా ఇప్పటివరకు స్పందన లేదని తెలిపారు.గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఎన్నో ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వహించిన తనకు ప్రస్తుతం శరీర సహకారం లేని పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. గురువారం జరగనున్న తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల డ్యూటీ నుంచి తనను మినహాయించాలని సంబంధిత అధికారులు, ఎన్నికల కమిషన్ మానవీయ దృష్టితో స్పందించాలని ఆయన పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.



# మాట ఇస్తే మడమ తిప్పను - చెప్పింది చేసి చూపిస్తా





**- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ పార్టీ నాయకుల్లాగా బోగస్ హామీలు ఇచ్చి తప్పించుకునే మనిషిని కాదని, మాట ఇస్తే మడమ తిప్పను, చెప్పింది చేసి చూపిస్తా అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఘణపురం మండలంలోని సురాయిపల్లి, ఉప్పరపల్లి, సోలీపూర్, అప్పారెడ్డి పల్లె, సల్కలాపూర్ గ్రామాలలో సర్పంచి అభ్యర్థులు కమలమ్మ, బాలరాజు, పద్మశ్రీ, వీరయ్య, గిరమ్మ తరఫున బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకుల్లాగా బోగస్ హామీలు ఇచ్చి తప్పించుకునే మనిషిని కాదని, మాట ఇస్తే మడమ తిప్పను, చెప్పింది చేసి చూపిస్తా అని స్పష్టం చేశారు. బి.ఆర్.ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే, రాబోయే ప్రభుత్వంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని కాపాడి, రైతులను రాజులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. 24 గంటల కరెంట్, సాగు%-%తాగు నీటి సదుపాయాలు, సకాలంలో పెట్టుబడి సాయం, కొరతలేని యూరియా సరఫరా, సమయానికి ధాన్యం కొనుగోలు వంటి చర్యల ద్వారా రైతాంగాన్ని బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఆదుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు పూర్తయినా ఒక్క అభివృద్ధి పనిని కూడా చేయలేదని విమర్శించారు. మాయమాటలు చెప్పి ప్రజల ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 420 హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయలేని కాంగ్రెస్ నాయకులకు పాలించే హక్కు లేదని మండిపడ్డారు. బి.ఆర్.ఎస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబితే, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు షాక్

**కాంగ్రెస్ కండువా కప్పుకున్న నాగినోనిపల్లి కీలక నేతలు**



**మహబూబ్ నగర్ డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

హన్వాడ మండలం, నాగినోనిపల్లి గ్రామంలో రాజకీయ పరిణామాల్లో పెద్ద మార్పు చోటుచేసుకుంది. సోమ వారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పల్లె బుచ్చయ్య, పర్వల్లి శ్రీను, అర్స గోపాల్, పల్లె బాచ్చయ్య, అర్స ఆంజనేయులు, ఎం. యాదయ్య, పల్లె కేశవులు, జె. బచ్చప్ప, ఎం. గంగపూరి, ఎం. కృష్ణయ్య, కుప్పగిరి చిన్న చెన్నయ్య తదితర నాయకులు బీఆర్ఎస్‌కు వీడ్కోలు పలికి కాంగ్రెస్ కండువా ధరించారు.ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా సీనియర్ నాయకులు మరేపల్లి సురేందర్ రెడ్డి (ఎం ఎస్ ఆర్), మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి నూతనంగా చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బలపడుతున్న పరిస్థితుల్లో ఈ చేరికలు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్య క్రమంలో హన్వాడ మండల అధ్యక్షుడు వి. మహేందర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు, పర్వల్లి మోహన్, అక్కపల్లి మోహన్, బీసీ సెల్ సత్యం, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలి

**–జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**







**నాగర్ కర్నూల్ : 08 డిసెంబర్ ప్రజా జ్యోతి**

పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ బధావత్‌సంతోష్ ఎన్నికల అధికారులను ఆదేశించారరు. సోమవారం తాడూర్ మండల పరిధిలోని ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మొదటి విడతగా 11న,జరగనున్న పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని, ఇతర ఏర్పాట్లు పలు సూచనలు అధికారులకు ఇచ్చారు.



## నామినేషన్ల ఉపసంహరణ..

**మధ్యాహ్నం తర్వాత ఎన్నికల గుర్తుల కేటాయింపు**
**మండల ఎంపీడీఓ సుర్ణ ఆదర్శ్ గౌడ్**



**చిన్నంబావి, డిసెంబర్ 8 (ప్రజాజ్యోతి):**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను నేడు నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ సుర్ణ ఆదర్శ్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. పోటీ నుంచి వైదొలగదలచుకున్న అభ్యర్థులు ఈరోజే తమ తమ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో హాజరై నామినేషన్లను అధికారికంగా ఉపసంహరించుకోవాలని సూచించారు.నిర్దిష్ట గడువు ముగిసిన అనంతరం ఎలాంటి ఉపసంహరణలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అలాగే, మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో కొనసాగుతున్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటిస్తామని పేర్కొన్నారు.అభ్యర్థులంతా నిర్ణీత సమయాన్ని తప్పనిసరిగా పాటించాలని మండల అభివృద్ధి అధికారి సుర్ణ ఆదర్శ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# బిజెపి అభ్యర్థి గెలిస్తే చిన్నపల్లికి 10 లక్షల అభివృద్ధి నిధులు

## చీకూరి శేఖర్

**జడ్చర్ల, డిసెంబర్ 08, ప్రజా జ్యోతి**

జడ్చర్ల మండలం మల్లె బోయినపల్లి గ్రామ సర్పంచ్ పదవికి బిజెపి తరఫున పోటీ చేస్తున్న చికూరి శేఖర్ ప్రజల విశ్వాసాన్ని పొందాలని కోరుతూ ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను ప్రకటించారు. గ్రామంలో తన ప్రచారాన్ని మరింత వేగవంతం చేస్తూ, "ఈసారి సర్పంచ్‌గా ఒక అవకాశం ఇవ్వండి%ా% మల్లె బోయినపల్లి గ్రామ పూర్తి రూపురేఖలు మారేలా అభివృద్ధి చేస్తా" అంటూ గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా బిజెపి మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణమ్మ మల్లె బోయినపల్లి కి 10 లక్షల రూపాయల అభివృద్ధి నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. "ఈ నిధులతో గ్రామంలో మొట్టమొదట అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, శుద్ధి చేసిన తాగునీటి సరఫరా, వీధి వెలుగులు వంటి పనులను అత్యవసర ప్రాధాన్యతతో ప్రారంభిస్తాను" అని తెలిపారు. గత పదేళ్లుగా గ్రామంలో ఎదురవుతున్న సమస్యలపై ఎవరూ పట్టించుకోలేదని, ఎన్నిసార్లు కోరినా పాలకులు అభివృద్ధి పేరుతో మాటలకే పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. "ప్రజల్లో నమ్మకం కల్పించేందుకు నేను చేసిన పోరాటం మీ కళ్లముందే ఉంది. చిన్నా%-%పెద్దా సమస్యల్లో మీకు తోడుగా నిలిచిన వ్యక్తినే గెలిపించండి. గెలిచిన వెంటనే ప్రతి వార్డులో కనబడే మార్పులను మీరు ప్రత్యక్షంగా గమనిస్తారు" అని శేఖర్ హామీ ఇచ్చారు. అభివృద్ధి అంటే కేవలం బడ్జెట్ కేటాయింపులు మాత్రమే కాదు,



వాటిని సమర్థవంతంగా ఉపయోగించి గ్రామం ప్రతి మూలలో సానుకూల మార్పులు తీసుకురావడం మహత్తర బాధ్యత అని పేర్కొన్నారు. బిజెపి అభ్యర్థులకు ఒక్కసారైనా అవకాశం ఇస్తే గ్రామం ఎంత వేగంగా మారుతుందో ప్రజలే చూస్తారని చెప్పారు. అంతేకాక, "మేము పని చేయడానికి సిద్ధంగా ఉన్నాం%ా% మీరు మీ అమూల్యమైన ఓటుతో మా నడకను బలపరిస్తే గ్రామ అభివృద్ధికి ఇది కొత్త అధ్యాయం అవుతుంది" అని ఆయన పత్రికాముఖంగా గ్రామస్తులకు విన్నవించారు. గ్రామ అభివృద్ధిని అత్యున్నత లక్ష్యంగా పెట్టుకొని, ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని ముందుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు.

# రేవెల్లి అభివృద్ధి బి.ఆర్.ఎస్ పాలనలోనే సాధ్యమైంది

## : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి





**రేవెల్లి, డిసెంబర్ 8, ( ప్రజా జ్యోతి):**

రేవల్లి మండలంలోనిరేవల్లి,కొంకలపల్లి,బండరవిపాకుల గ్రామాలలో బి.ఆర్.ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల తరఫున మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇంటింటి ప్రచారంనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ ఏర్పాటుకు ముందు రేవెల్లి నిర్లక్ష్యానికి గురయ్యిందని, తాను ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడిగా, మంత్రిగా ఉన్న సమయంలోమండల హోదాతో పాటు సాగు%-%తాగునీరు, కె.జి.బి.వి, కళాశాల, రోడ్లు వంటి మౌలిక వసతులను అందించామని గుర్తు చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలనుఅమలు చేయక, రైతులు ఎరువుల కొరత, కరెంట్ కోతలు, మద్దతు ధరల లేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. బి.సిలను రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడంతో సాయి ఈశ్వరాచారి ప్రాణాల కోల్పోయారని ఇది ప్రభుత్వ హత్యేననిపేర్కొన్నారు.రాబోయే ఎన్నికల్లో బి.ఆర్.ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి అభివృద్ధిని కాపాడాలని ప్రజలను కోరారు.కార్యక్రమంలో బోర్ల భీమన్న, శివరాం రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పలుస రమేష్ గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మూడు గ్రామాల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

## అభ్యర్థుల విజయం ఖాయం అన్న ప్రజల నమ్మకం

**మహబూబ్ నగర్ డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని మచన్ పల్లి, రామచంద్రపురం మరియు అప్పయపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు వెంకటయ్య, బాబురావు, అరుణ జ్యోతి ప్రచార కార్యక్రమానికి గ్రామస్థులు విశేషంగా స్పందించగా, భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను మరింత వేగవంతం చేసే బాధ్యత ప్రజల మద్దతుతో కాంగ్రెస్ నాయకత్వం తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే రహదారులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు దక్కుతున్న ప్రజా మద్దతు పార్టీ బలాన్ని మరింత పెంచుతోందని ఆయన



పేర్కొన్నారు. అభ్యర్థులను గెలిపించడం ద్వారా అభివృద్ధి పథకాలు మరింత వేగంగా అమలవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, సిరాజ్ ఖాద్రి, ఫయాజ్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది
- కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 8 (ప్రజా జ్యోతి):**

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పిలుపునిచ్చారు. మొదటి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘణపురం మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పరపల్లి, సూరాయిపల్లి, దొంతికుంట తండా, మానాజీపేట, మల్కాపురం, గట్టు కాడిపల్లి, వెంకటంపల్లి, ఆగారం, ఖిల్లా ఘణపురం, మామిడి మాడ, సల్కేలాపురం గ్రామాలతో పాటు పలు తండాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో గ్రామాలలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ఒక్క రేషన్



కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కేవలం అభివృద్ధి పేరుతో కబ్జాలు, అవినీతి మాత్రమే జరిగిందన్నారు. బిఆర్ఎస్ కబ్జాకోరుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలిస్తే గ్రామాలలో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని, మీరు గెలుపొందితే అభివృద్ధి తన బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, నూతన ఆసుపత్రుల నిర్మాణం, అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఘణపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయకుమార్, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, వెంకట్రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, ప్రముఖ వైద్యులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మహిళలు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల విధులకు గైర్హాజరు అయితే చర్యలు : కలెక్టర్ హెచ్చరిక

**మహబూబ్ నగర్ డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

జిల్లాలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విధులు కేటాయించిన ప్రీసైడింగ్ ఆఫీసర్లు (పి.ఓలు), అసిస్టెంట్ ప్రీసైడింగ్ ఆఫీసర్లు (ఓ.పి.ఓలు) తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అందరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధులకు గైర్హాజరై ఎన్నికల పనుల్లో అంతరాయం కలిగించిన వారిపై ఎన్నికల చట్టాల ప్రకారం క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికలు ప్రశాంతంగా మరియు పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ సేవలు సమయానికి అందించాలన్నారు.



# డిజిటల్ విద్యతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వెలుగు





## పదో తరగతిలో 100% ఫలితాల లక్ష్యం"

**మహబూబ్ నగర్ డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో)**

మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నూతన విద్యా అవకాశాలు అందించేందుకు ముందుకు వచ్చారు. పదో తరగతి విద్యార్థులు ఈసారి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రత్యేకంగా రూపొందించిన క్యు ఆర్ కోడ్ డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల, ఎదిర ఉన్నత పాఠశాల, ఏనుగోండ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి ఈ డిజిటల్ స్టడీ మెటీరియల్ అందించారు. పాఠ్యాంశాలు, వీడియో క్లాసులు, పరీక్షా సాధన ప్రశ్నాపత్రాలు వంటి డిజిటల్ కంటెంట్ క్యు ఆర్ కోడ్ ద్వారా ఎప్పుడైనా స్కాన్ చేసి చదువుకోవచ్చని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే గత ప్రభుత్వ పాలనలో మహబూబ్ నగర్ విద్యా రంగం నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు అదే జిల్లాకు విద్యా పరంగా నూతన దిశ చూపుతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి అనుమతితో జిల్లాకే ఐఐ ఐ టీ విద్యాసంస్థను తీసుకురావడం ఇదే సంకల్పానికి నిదర్శనమని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇప్పటికే పాఠశాలల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో ఇంకా అనేక విద్యా కార్యక్రమాలు అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషిద్ ఖాన్, మహ్మద్ మోసిన్, యాదమ్మతో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత కోసం ఖాదర్ ముందడుగు

## పోతనపల్లిలో క్రికెట్ గ్రౌండ్ కల నిజం

**మహబూబ్ నగర్ డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో)**

పోతనపల్లి గ్రామ యువత ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న క్రికెట్ గ్రౌండ్ కల చివరకు నెరవేరింది. గ్రామంలో క్రీడా సదుపాయాల లేమితో నిరాశ చెంది ఉన్న యువత అభ్యర్థనపై బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్ వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. యువతతో సమావేశమైన ఖాదర్, వారి సమస్యను అర్థం చేసుకుని గ్రామ అభివృద్ధిలో క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. తన హామీ మేరకు గ్రామ పరిసరాల్లోని ఒక భూమిని లీజుకు తీసుకొని దాన్ని క్రికెట్ గ్రౌండ్‌గా మారుస్తూ శుభ్రపరిచే పనులను ప్రారంభించారు. మైదానంలోని రాళ్లు, గుంతలు, గడ్డి తొలగించి నేల సమపాళ్లలో ఉండేలా మట్టిని పరచి కేవలం కొద్ది రోజుల్లోనే ఆ స్థలానికి పూర్తిగా క్రికెట్ మైదానం రూపం తీసుకొచ్చారు. యువత ఆడుకునేందుకు బ్యాటింగ్ పిచ్, పరుగు పరుగులు పెట్టేందుకు అవసరమైన స్థలం కూడా అందుబాటులోకి వచ్చింది.

గ్రౌండ్‌ను యువతకు అందజేసిన సందర్భంగా ఖాదర్ మాట్లాడుతూ,"యువత అభివృద్ధి నా ప్రాధాన్యం. క్రీడల్లో భాగస్వామ్యం ఉంటే మంచి ఆరోగ్యం, మంచి భవిష్యత్తు సాధ్యం. మీకు అవసరమయ్యే ప్రతీ సహాయానికి నేను మీతో ఉంటాను" అని తెలిపారు. గ్రామ ప్రజలు, యువత తల్లిదండ్రులు, పెద్దలు ఖాదర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందిస్తూ గ్రామం కోసం పనిచేసే నాయకుడు కావాలంటే ఇలాగే ఉండాలని ప్రశంసిస్తున్నారు.ఈ క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు పోతనపల్లి యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపగా, గ్రామంలో క్రీడా కార్యక్రమాలు మరింత చురుకుగా జరగనున్నాయని ప్రజలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# వంకేశ్వరం బి ఆర్ఎస్ అభ్యర్థిగా నేనావత్ పార్వతి లక్ష్మణ్

-గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా
-ఒక్కసారి సర్పంచ్గా అవకాశం కల్పించండి
-నేనావత్ పార్వతీ లక్ష్మణ్ నాయక

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 8 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూలు జిల్లా పదర మండలం వంకేశ్వరం గ్రామ బి ఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా నేనావత్ పార్వతి లక్ష్మణ్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వంకేశ్వరం గ్రామం బి ఆర్ ఎస్ సర్పంచ్ అభ్యర్థి నేనావత్ పార్వతి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ వంకేశ్వర గ్రామ సర్పంచ్ గా తమకు ఒకసారి ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని గ్రామ ప్రజలకు కోరారు. సర్పంచ్ గా ఒకసారి అవకాశం కల్పిస్తే నిరంతరాయంగా గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయ కుటుంబం నుంచి రావడం జరిగిందని. తమను ఆదరించి ఒక్కసారి గ్రామ సర్పంచ్గా గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తమకు గ్రామ ప్రజలు అండ మెండుగా ఉందని విజయం సాధిస్తామని ధీమ వ్యక్తం చేశారు. గ్రామంలో మౌలిక వసతులకు కల్పనకు కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటామని తద్వారా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు ఆమె కోరారు. ఆమె వెంట నాయకులు టీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎస్ తిరుపతయ్య యాదవ్, పెరుమల శ్రీను, జై శివరాం యాదవ్, తదితరులు ఉన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## కాంగ్రెస్ అభ్యర్థి వెంకటయ్య



**మహబూబ్ నగర్, డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి )**

మాచన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి వెంక టయ్య ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. గ్రామంలోని ప్రతి వాడా, ప్రతి ఇంటిని సంద ర్శిస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసు కుంటున్నారు. ఆత్మీయ సంభా షణలతో ప్రజల్లో మంచి స్పంద నను సొంతం చేసుకుం టున్నా రు.ప్రచారం సందర్భంగా వెంక టయ్య మాట్లాడుతూ, మాచన్‌పల్లిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి, శుద్ధి నీరు, రహదారులు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత ఆయనను ఆత్మీయంగా ఆహ్వానిస్తూ తమ సమస్యలను వివరించారు. ప్రతీ అంశాన్ని నోట్ చేసుకుంటూ పరిష్కారం కోసం కృషి చేస్తానని వెంకటయ్య భరోసా ఇచ్చారు. ప్రచారం ముందుకెళ్లేకొద్దీ వెంకటయ్యకు గ్రామ ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోంది. స్థానికులు ఆయనపై విశ్వాసంతో, మాచన్‌పల్లి అభివృద్ధి దిశగా ఆయన నాయకత్వం మార్గదర్శకమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇప్పలపల్లి ప్రజల్లో కొత్త ఆశ

- కత్తెర గుర్తుతో మంగమ్మ ప్రచారం జోరు
- మార్పు కోసం ఎదురు చూస్తున్న ఓటర్లకు స్వతంత్ర అభ్యర్థి హామీ

**మహబూబ్ నగర్, డిసెంబర్ 08 ( ప్రజా జ్యోతి )**

ఇప్పలపల్లి గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి మంగమ్మ ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. కత్తెర గుర్తుతో పోటీ చేస్తున్న మంగమ్మ పాదయాత్ర రూపంలో ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజల సమస్యలను వినడం ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పాత వాగ్దానాలపై నిరాశ చెందిన గ్రామ ప్రజల్లో మార్పు కోసం వేచి ఉన్న ఈ సమయంలో మంగమ్మ ఇస్తున్న భరోసా సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తోంది. ప్రజలతో మాట్లాడిన సందర్భంగా మంగమ్మ తాగునీటి సమస్య, వర్షాకాలంలో రహదారుల దుస్థితి, యువతకు క్రీడా మైదానాల లేమి, మహిళల స్వయం ఉపాధి అవకాశాల కొరత వంటి అంశాలను ప్రాధాన్యతగా పరిష్కరించే హామీ ఇచ్చింది.

"కత్తెర గుర్తుకు ఓటేసిన రోజు నుంచే ఇప్పలపల్లి అభివృద్ధి దిశగా నడుస్తుంది. ఏ కుటుంబం కష్టాల్లో ఉండకుండా పనిచేస్తాను" అని మంగమ్మ గ్రామ ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రచారం కొనసాగుతున్న కొద్దీ ఆమెకు ప్రజల ఆదరణ పెరుగుతూ ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పలపల్లి గ్రామంలో కత్తెర గుర్తు కొత్త రాజకీయ ఊపును తెచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

